




ప్రధానితో వేమిరెడ్డి దంపతులు భేటి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయానికి వెళ్లిన ఎంపి వేమిరెడ్డి దంపతులు.. ఈ సందర్భంగా ప్రధానమంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా పలకరించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోడీకి వేమిరెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. నరేంద్ర మోడీ సారధ్యంలో దేశం మరింత పురోగమిస్తుందని పేర్కొన్నారు. దేశాన్ని అగ్రప్రధాన నిలుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీని కలవడంపై వేమిరెడ్డి దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.



ప్రధానిని కిలిసిన వేమిరెడ్డి దంపతులు

రేషన్ బియ్యం మాఫియా డాన్..!

రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది....పేదల కోసం ఇస్తున్న రేషన్‌బియ్యంలో పందికొక్కులు పడ్డాయి..ఎందరో నిరుపేదల కడుపునింపుతోన్న బియ్యం రాద్ధాంతం నడుస్తోంది...ఇదే కొనసాగితే కేంద్ర ప్రభుత్వం బియ్యానికి నగదు చెల్లించి చేతులు దులుపుకునే అవకాశం ఉంది. జిల్లా వ్యాపితంగా రేషన్ బియ్యం మాఫియా అప్పుడు...ఇప్పుడు కొనసాగుతోంది. నెల్లూరు కేంద్రంగా పెద్ద ఎత్తున చెన్నయ్ అక్కడ నుంచి విదేశాలకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. రేషన్ వాహనాలు...వ్యక్తుల నుంచి ఇటీవల వరకు నగరంలో వెయ్యి మంది రేషన్ బియ్యం కొనుగోలు చేసే సిండికేట్లు ఉండేవారని సమాచారం. ఇటీవల నెల్లూరు నగరంలోని ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన ఒక వ్యక్తి డాన్‌గా వ్యవహరిస్తున్నారనే సమాచారం. "పెద్దాయన నున్ను చేసుకోమన్నారు. మీరెవరూ ఆ పనిచేయకండి " అంటూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతుంటే విజిలెన్స్, డిఎస్‌ఒ, పోలీసు, తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో దొంగలు గప్‌చుప్‌గా ఉన్నారు..

నగరంలో ఇద్దరు పెత్తనం -అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యం పక్క రాష్ట్రాలు, పక్క దేశాలకు తరలిపోతున్నాయి.. ప్రభుత్వం రేషన్ బియ్యంకు బదులుగా నగదు చెల్లిస్తామని చెబుతోన్న దానికి ఇది బలం చేకూర్చేలా కనిపిస్తోంది. పేదలకు తిండి, బట్ట, గూడు నినాదాలతోనే ప్రభుత్వం అధికారంలోకి వస్తున్నాయి. ఎన్‌టి రామారావు ప్రవేశపెట్టిన రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం ప్రజలు రేషన్ బియ్యం తింటున్నారనే నిజం. జిల్లా వ్యాపితంగా 1513 రేషన్ షాపులున్నాయి. 7.33 లక్షల రేషన్‌కార్డులున్నాయి. నగర ప్రాంతాల్లో పేద, మధ్య, తరగతి ప్రజలకు రేషన్ కార్డులున్నాయి. పురుగులు, మట్టిపెళ్లలు, వాసన భయంతో ఎక్కువ మంది రేషన్ బియ్యం తినడం లేదు. వాటిని టిఫిన్, ఇతర వస్తువుల తయారీలకు ఉపయోగించుకుంటున్నారు. కొందరు అమ్మకాలు చేస్తున్నారు, రేషన్ ఇచ్చే వాహనదారులకే కేజీ రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. అక్కడ నుంచి రూ.16ల ఒకరికి చేరుతోంది...అక్కడ నుంచి రూ. 24 మరోకరికి చేరుతోంది. వీటిని కొందరు రైలు మిల్లులకు తీసుకెళ్లి పాలిషింగ్ చేసి, 25 కేజీల బస్తాలు చేసి , బయట ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలుస్తోంది. చెన్నయ్ అక్కడ నుంచి విదేశాలకు ఎక్కువ తరలిపోతున్నట్లు సమాచారం. ఇటీవల కావలి, కందుకూరు, నెల్లూరు, ఇతర ప్రాంతాల్లో ఈ బియ్యం



పట్టుబడిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వంలో ఒక్క నెల్లూరు నగరంలోని రేషన్ బియ్యం జనాల నుంచి కొనుగోలు చేయడానికి సుమారు వెయ్యి మంది చిన్న వ్యాపారాలు ఉండేవారని సమాచారం. ఇటీవల ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తరువాత కందుకూరు, కావలి, నెల్లూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంతోపాటు ఇతర పట్టణాల్లో సిండికేట్లుగా ఏర్పడి తరలిసున్నట్లు తెలిసింది. నెల్లూరు నగరంలోని ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన ఒక వ్యాపారి ప్రస్తుతం ఈ మాఫియాలో డాన్‌గా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.ఇతనికి మరో వ్యక్తి కలిసి మొత్తం రవాణా చేస్తున్నారని సమాచారం. గుడిపల్లిపాడు వద్ద ఒక రైస్ మిల్లు, జాతీయ రహదారి వద్ద గోదాముల్లో ఈ బియ్యం ఉంచి రాత్రి సమయాల్లో చెన్నయ్ వెళుతున్నట్లు తెలిసింది. జాక్‌పట్ లారీలతో వీటిని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. " పెద్దాయన నన్ను ఈ వ్యాపారం చేసుకోమన్నారు. మీరు ఎవరూ రావద్దు "అంటూ బెదిరింపులకు దిగడంతో మిగిలిన వారు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా విజిలెన్స్, పోలీసులు, డిఎస్‌ఒ అధికారులు పెద్దగా స్పందించడం లేదని విమర్శలున్నాయి. ఈ అక్రమణ రవాణాల్లో వీరి పాత్రపైనా అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రజా ప్రతినిధులు నెలనెలా పెద్ద మొత్తంలో ముట్టజెబుతున్నారనే విమర్శలున్నాయి.

మూడేళ్ల నుంచి రైస్ మిల్లర్లు దూరం..!

రేషన్ బియ్యం సరఫరాలో జిల్లాలోని రైస్ మిల్లర్లుది కీలక బాధ్యత . మూడేళ్ల క్రితం వరకు ప్రభుత్వం రైసు మిల్లర్లకు వరి ధాన్యం సరఫరా చేసేవారు. ఇందులో 67 శాతం బియ్యం రూపంలో ప్రభుత్వానికి (సివిల్ సెప్లయ్, ఎఫ్‌సిఐ) అందజేయాలి,. ప్రతి నెలా హాస్టళ్లు, రేషన్ షాపులు, మధ్యాహ్నభోజనం కోసం 12 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసేవారు. మిల్లింగ్ ఛార్జ్‌ల కింద క్వింటాల్‌కు రూ.110 ప్రభుత్వం మిల్లర్లకు చెల్లించేది. మూడేళ్ల నుంచి ప్రభుత్వం ఒక్క గింజ ఇక్కడ మిల్లర్లకు ఇచ్చి వారి నుండి బియ్యం తీసుకోవడం లేదు. శ్రీకాకుళం, పశ్చిమ,తూర్పు గోదావరి, విశాఖ పట్నం నుంచి మాత్రమే ఇక్కడను అధికారులు బియ్యం తెచ్చుకుంటున్నారు. రేషన్ బియ్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెడుతోంది. ప్రతినెలా జిల్లాలో రూ. 50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం పేదలకు ఉపయోగపడుతోంది. కొందరు అనర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వడంతో వారి బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. దీనిని కొందరు వ్యక్తులు అక్రమ మార్గంలో రవాణా చేసి, కోట్లు సంపాదిస్తున్నారు. రేషన్ బియ్యం ప్రధాన ఉద్దేశం పక్కదారి పడుతోంది. బియ్యం ధరలు రోజు రోజుకు భారీగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం కేజీ ఒక్క రూపాయికే బియ్యం ఇస్తుంది. ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని బియ్యం పదులు నగదు ఇస్తామంటే పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం ఇచ్చే నగదుతో బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. రేషన్ బియ్యం అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

సిపిఎం రాష్ట్ర మహాసభలు

ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో

సమిష్టి కృషితో విజయవంతం చేయాలి

ఆహ్వాన సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో మూడురోజుల పాటు జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను సమిష్టి కృషితో విజయవంతం చేయాలని మహాసభల ఆహ్వాన కమిటీ పిలుపునిచ్చింది. గురువారం స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రప్రథమంగా 1978లో సిపిఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించారన్నారు. తిరిగి 46 ఏళ్ల తరువాత నిర్వహించే అవకాశం దక్కడం సంతోషకరమన్నారు. విప్లవాలకు పురిటి గడ్డగా



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

పేరుగాంచిన సింహపురిలో ఈ మహాసభలు నిర్వహించుకొవడం ఆనందదాయకమన్నారు. ఇటీవల సిపిఎం జిల్లా మహాసభలు ఇందుకూరు పేట ప్రాంతంలో విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. ఈ మహాసభల్లో జిల్లా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పోరాటాలు, ఉద్యమాలు అవి విజయవంతం అయ్యేందుకు ప్రణాళిక రచనలు వంటి పలు అంశాలపై సుదీర్ఘమైన చర్యలు చేపట్టామన్నారు. అదే తరహాలో రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలో నెలకొం టున్న సమస్యలను అధిగమించేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకొనేందుకు రానున్న రోజుల్లో ఎటువంటి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం .మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, డాక్టరు రామ చంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టరు బి.రాజేశ్వరరావు, ప్రజా సంఘాల నాయ కులు అబ్బయ్యరెడ్డి,ఎలంకి వెంకటేశ్వర్లు, లాయర్ అసోసియేషన్ నాయకులు అంకయ్య, బి.వి. రమణారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నందిని పొదుపు సంస్థ పేరుతో లక్షల రూపాయలు దోపిడీ

ప్రజాశక్తి-ఉలవపాడు

ఉలవపాడు హై స్కూల్ సంఘానికి చెందిన నందిని పొదుపు సంస్థ పేరుతో నిరు పేద లైన గిరిజనులు దగ్గర పొదుపు పేరుతో డబ్బులు వసూలు చేసి పరారీ. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా డబ్బులు వసూలు చేసి పరారీ అయినట్లు బాధితులు పేర్కొన్నారు. మండలంలో 11 గిరిజన సంఘాల చెందిన వారి నుండి లక్షలాది రూపాయలు వారాల పేరుతో వసూలు చేసి నందిని ఆచూకీ తెలియకపోవడంతో తో 600 మంది గిరిజనులు దిక్కుతోచని పరిస్థితిలో గురువారం స్థానిక పోలీస్ చేసిన వద్ద సిపిఎం నేతత్వంలో ఆందోళన చేపట్టారు. ఎస్ఐ అంకమ్మ కు వినతి పత్రం అందజేశారు.

జిజిహెచ్ అభివృద్ధి కమిటీ ప్రమణాస్వీకారోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో అభివద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, సురేందర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి హాజరయ్యారు. ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందుబాటులో ఉండే విధంగా హాస్పిటల్ అభివద్ధి కమిటీ సభ్యులు పనిచేయాలని సూచన చేశారు. చివరగా



అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్‌గా మడపర్తి శ్రీనివాసులు, డైరెక్టర్లుగా దారా మల్లికార్జున,బ్రహ్మారెడ్డి, మొగరాల సురేష్,అబిదా సుల్తానాలచేత ప్రమాణా స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులు మార్యాదపూర్వకంగా జిజిహెచ్ సూపరింటిండెంట్ సిద్ధినాయక్‌ను కలిశారు.

నాలుగు రోజులు ఆధార్ శిబిరం

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్

కలెక్టర్ ఆదేశాల ప్రకారం గుడ్లూరులోని విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఇఒ రి పర్యవేక్షణలో ఈనెల నుంచి 31వ తేదీ మధ్యలో వారానికి 4 రోజులు (సోమ, మంగళ, గురు, శుక్ర) ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఇఒ గోవర్ధన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



గోవర్ధన్, ఎంఇఒ

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : గ్రామ అభివద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వా ములు కావాలని ఎంపిడిఒ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు మండల పరిషత్ కార్యాలయం లో ప్రగతి పథంలో అభివద్ధి కార్యక్రమంపై ఏర్పాటు చే సిన శిక్షణలు గురువారంతో ముగిశాయి. ఎంపిడిఒ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఐక్య రా జ్యసమితి సూచన మేరకు 2030 నాటికి అన్ని రం గాల లో స్థూల రేటు సాధించడమే కాకుండా, గ్రామాలు సర్వ తోముఖంగా అభివద్ధి పథంలో పయనించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. రెండు రోజుల శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వివిధ శాఖల అధి కారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -వెంకటాచలం : మండలంలోని కనుపూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే కోవూరుకు చెందిన కరిముల్లా, ఇబ్రహీమ్ బైక్‌పై కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి వస్తుండగా కనుపూరు సమీపంలో ఉన్న మలుపు వద్ద కుక్కలు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటాచలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకులో సస్యరక్షణ చర్యలపై శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు : రావులకొల్లు గ్రామం లో రైతులుకు పొగాకు పంట లో పాటించాల్సిన సస్య రక్షణ చర్యలు, రసాయన అవశేష నిర్మూలనపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. కందుకూరు 26 వ వేలం నిర్వహనాదికారి ఎమ్. కిరణ్ మాట్లాడారు. ప్రస్తుతం పొగాకు పంటలో సిటిఆర్ఐ అధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే అవసరం అయిన మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. ఇంకా సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ శివ కుమార్, ఐటీసీ మేనేజర్ జి. వెంకట్ రావు, . సిఎస్ఎస్ కంపెనీ ప్రతినిది రామాంజనేయులు.జిపిఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసులు మాట్లాడారు. రైతు సోదరులు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలని సూచించారు. పొగాకు బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : 3,4,5 తరగతుల విద్యార్థులకు నెలకి ఒక్కసారైనా క్విజ్ కాంపిటీషన్స్,సెమినార్ లను నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి- 1 షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక నార్త్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్న స్వీయ మదింపు పరీక్షలను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి డిక్షనరీలు, గ్రంథాలయ పుస్తకాలు ప్రతిరోజు విద్యార్థులు చదివే విధంగా చూడాలని తగు సూచనలు చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాఫర్ మోదీన్, ఉపాధ్యాయులు సలీం, సందానీ బేగం పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఇఒ షేక్ మస్తాన్‌వలి

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగన్ వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కందుకూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం గురువారం అందజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి సల్మా ,నాయకులు డిఎం రాయుడు,అంగన్వాడి కందుకూరు ప్రాజెక్టు నాయకులు రామతున్నిసా ,జరీనా ,ఉమామహేశ్వరి, మస్తానమ్మ ,అనురాధ పాల్గొన్నారు.



కొలిక్కిరాని 'రాళ్లపాడు' గేటు మరమ్మతు పనులు

- చేతులెత్తేసిన వైజాగ్ నిపుణుల బృందం
- పనులను పరిశీలించిన ఎంఎల్ఎ 'ఇంటూరి'
- ఆందోళనలో రైతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి లింగసముద్రం

రాళ్లపాడు కుడి కాలువ తూము స్టాప్ లాక్ గేటు విరిగిపడి ఆరు రోజులు గడుస్తున్నా ఎలాంటి పరిష్కారం లభించలేదు. ఆదివారం నుంచి అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా సమస్య ఓ కొలిక్కి రాలేదు. గురువారం విశాఖపట్నం నుంచి వచ్చిన స్కూబా డైవర్స్ ఇంజనీరింగ్ బందం పలు ప్రయత్నాలు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. విశాఖపట్నం నుంచి ప్రత్యేక బందం వస్తుంది సమస్యను వెంటనే పరిష్కరిస్తారని రైతులకు ఆశలు కలిగించారు. వారూ చేతులెత్తి వేయడంతో రైతులు నిరాశతో ప్రాజెక్టు వద్ద నుంచి వెను తిరిగి వెళ్లారు. వైజాగ్ బందం వస్తే సమస్త పరిష్కారం అవుతుందని ఎంతో ఆశగా ఉన్న రైతులకు నిరాశే మిగిలింది.ఐదు రోజుల నుండి గేటును తెరిచేందుకు వివిధ ప్రయత్నాలు చేసినప్పటికీ సఫలం కాలేదు. కుడి కాలువ తూము వద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులను శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజతో కలిసి గురువారం మధ్యాహ్నం పరిశీలించారు.ప్రాజెక్టు అధి కారులు, వైజాగ్ బందంతో మాట్లాడారు ఇరిగేషన్ ఎస్ ఈ వరలక్ష్మి పనులు పర్యవేక్షించారు.సమస్యను పరిష్కరించి రైతులకు నీటిని విడుదల చేయించేలా చూడాలని భావించినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించలేదు.వైజాగ్ నుండి వచ్చిన మెకానిక్ బందంతోను అధికారులతోనూ చర్చించారు. తూముకు రంధ్రం వేసి నీటిని కాలువకు విడుదల చేసేలా చూడాలని అధికారులతో చర్చించారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

అధికారులు నిర్లక్ష్యం కారణంగానే కుడి కాలువ తూము గేటు విరిగిపడిందని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో నీరు లేని సమయంలో గేటులను తూములను పరి శీలించకపోవడం వలన ఇలాంటివి జరుగు తున్నాయని, అధికారులు ముందే స్పందించి తగిన చర్యలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేవని అంటున్నారు. నార్లు పోసుకొని వరి నాట్లకు సిద్ధమవుతున్న తరుణంలో ఇలా జరగడం వల్ల రైతులందరూ ప్రాజెక్టు వైపు చూస్తున్నారని వెంటనే సమస్యను పరిష్కరించి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.



అధికారులు సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ, సబ్ కలెక్టర్

రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కారం : ఇంటూరి

ప్రజాశక్తి - లింగసముద్రం : పెంట్రాల సచివాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యార ఁకందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కూడా పాల్గొన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిజమైన భూ హక్కుదారుల కోసమే ' మీ భూమి మీ హక్కు పేరుతో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు ఉపయోగించుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. లింగసముద్రం మండలంలో వైసిపి నాయకులు పేదల భూములను ఆన్ లైన్‌లో ఎక్కించుకోవడం వంటి ఘటనలు చోటు చేసుకు న్నాయన్నారు.ఈ నేపథ్యంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని ఇంటూరి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీతామాలక్ష్మి, ఎంపిడిఒ కట్టా శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు ,రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

దళిత కాలనీలో సమస్యలు తిష్ట

పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలోని అడవి రాజు పాలెం, దళిత కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. గురువారం ఆ కాలనీలో నెలకొన్న సమస్యలను 'ప్రజాశక్తి'పరిశీలించింది. ఆ కాలనీలో 300 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరికి కేవలం 15 సెంట్లు మాత్రమే స్మశాన స్థలం ఉంది. ఆ స్థలంలో పూర్వం రోజుల్లో ఓ భావి ఉండేది. ఆ భావి స్థలాన్ని ఆనాటి గ్రామ సర్పంచ్, తన పేరుతో పట్టా తెచ్చుకున్నారని, దహన కార్యక్రమాలు అనంతరం నిర్వహించే కార్యక్రమాల కోసం వేరే ప్రాంతంలో బావి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ నేటికి నెరవేరలేదు. శ్మశానానికి వెళ్లడానికి దారి లేదు. ఎలికేరు వాగు వస్తే మృతదేహాలను శ్మశానానికి తీసుకెళ్లాలంటే ఎంతో కష్టపడాల్సి వస్తుంది. కొత్త చెరువులో మామిడి తోటలు ఉన్నాయి. వాటిలోకి వెళ్లడానికి దారి లేక సతమతం అవుతున్నారు. పాత చెరువులో దళితులు, బిసిలకు మెట్ట మాగాణి భూములు ఉన్నాయి. బిసిలు తన రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని పట్టాలు తెచ్చుకున్నారని. గత ప్రభుత్వంలో రీసర్వేలో దళితులు సాగు చేస్తున్న భూములను అటవీ భూములుగా గుర్తించి పట్టాలు ఇవ్వటానికి నిరాకరించరని చెబుతున్నారు. బిసిలకు అదే భూమిలో పట్టాలు ఎలా వచ్చాయి? అంటూ ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీకి శ్మశానానికి వెళ్లేందుకు దారి చూపించాలని, ఎలికేరు వాగు పై బ్రిడ్జి పెంచాలని, పొలాల్లోకి వెళ్లడానికి, రహదారి ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. లేదంటే సిపిఎం, జనసేన ఇతర రాజకీయ పార్టీల సహకారంతో ఆందోళన చేపడతామని కాలనీ వాసులు అఖిల గుంట రంగసాయి, కొలకలూరి ఆమోసు తెలిపారు.



జిల్లాకు ప్రత్యేక అధికారిగా శశిధర్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లాకు ప్రత్యేక అధికారిగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను ప్రభుత్వం నియమించింది. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు విషయంలో ప్రత్యేక అధికారి కీలకంగా వ్యవహరించనున్నారు.



కోన శశిధర్, ఐఎఎస్

మేమంతా మీ వెంటే.!

ప్రజాశక్తి-కందుకూరు : జగనన్న మేమంతా 'మీ వెంటే ఉంటామంటూ ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గ వైసిపి ప్రజా ప్రతినిధులు ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వంలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. తాడేపల్లి లో జరిగిన ప్రజా ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్ని వారు జగన్మోహన రెడ్డిని కలిశారు. వలేటివారిపాలెం జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, జెడ్‌పిటిసి ప్రతినిధి ఇంటూరి హరిబాబు వలేటివారిపాలెం ఎంపిపి పొనుగోటి మౌనిక, ఎంపిపి ప్రతినిధి పొనుగోటి మహేష్, కందుకూరు జడ్పిటిసి ప్రతినిధి తొట్టెంపూడి శ్రీనివాసులు, కందుకూరు ఎంపీపీ ఇంటూరి సుశీల ,ఎంపీపీ ప్రతినిధి ఇంటూరి మాధవరావు, లింగసముద్రం ఎంపిపి పెన్నా కష్ణయ్య ,గుడ్లూరు ఎంపిపి పులి రమేష్, ఉలవపాడు ఎంపిపి వాయల మస్తానమ్మ , ప్రతినిధి వాయల తిరుపతి, ఉలవపాడు జడ్పిటిసి చేవూరి అరుణ , జడ్పిటిసి ప్రతినిధి చేవూరి శ్రీనివాసమూర్తి ,కందుకూరు వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ప్రతినిధి గణేషం గంగిరెడ్డి ఉన్నారు.



సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై శిక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ సబ్సిడీతో గృహాలకు ఇంటికప్పుపై భాగంలో సోలార్ రూఫ్ ఆఫ్ ఏర్పాటు చేసుకోని విద్యుత్ ఉత్పాదన చేసే అవకాశం ఉంటుందని, అంతే కాకుండా ప్రభుత్వం నుంచి రూ 30 వేల నుంచి రూ.78 వేలు సబ్సీడీగా పొందవచ్చుని నేషనల్ పవర్ ట్రాయినింగ్ ఇన్స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ కె.ముత్తుకుమార్ అన్నారు. గురువారం నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సోలార్ రూఫ్ ఆఫ్ అంశంపై విద్యుత్తు ఉద్యోగులకు నిరంతర అధ్యయన కేంద్రంలో ఏర్పాపు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. నగరానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలచంద్ర మాట్లాడారు.

పారిశుధ్య కార్మికుడికి మేయర్ పరామర్శ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని వాహబ్ పేట ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ గాయపడి నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుడు జి.పెంచలయ్య ను మేయర్ స్రవంతిజయవర్ధన్ గురువారం పరామర్శించారు. గాయపడిన కార్మికుడికి పూర్తిగా అండగా ఉంటామని వైద్యానికి కావాల్సిన సహాయం నగరపాలక సంస్థ ద్వారా అందజేస్తామని మేయర్ తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమం ఏర్పాట్లలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ కు పారిశుధ్య నిర్వహణ విధులను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు గురు వారం ఆయన విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించి సిఎం కార్యాలయం సిబ్బందితో కలిసి పనులను పర్యవేక్షించారు.

జగన్‌ను కలిసిన ఎంఎల్‌సి 'పర్వతరెడ్డి'

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గురువారం కలిశారు. నెల్లూరుకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రైతులకు సూచనలు

గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని చేవూరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షత న పొలం బడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వ్యవసాయాన్ని లాభసాటిటా మార్చేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామ నాయకులు గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు, రైతులు ఉన్నారు.

జర్నలిస్ట్ పై దాడి అమానుషం

ప్రజాశక్తి-బిట్రగుంట

సినీ నటుడు మోహన్ బాబు జర్నలిస్ట్ పై చేసిన దాడి అమానుషమని బోగోలు సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. బోగోల్ సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు వారదులుగా పని చేస్తున్న జర్నలిస్టు రంజిత్ పై చేయి చేసుకోవడం హేయమైన చర్య అని దీన్ని బోగోలు సిపిఎం తరపున ఖండిస్తున్నామని తెలిపారు. మోహన్ బాబు కుమారుడు మనోజ్ కుమార్ జర్నలిస్టులను ఇంటిలోకి ఆహ్వానిస్తే వచ్చిన జర్నలిస్ట్ పై చేయి చేసుకొని రౌడీయిజం చేయడం చాలా బాధాకరమన్నారు. జర్నలిస్టుకు మోహన్ బాబు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. మోహన్ బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కూడా జర్నలిస్టుపై దాడి చేసిన ఘటన కూడా ఉన్నాయన్నారు. జర్నలిస్ట్ పై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, ఇటువంటి ఘటనలు కాకుండా తిరిగి పునరావతం కాకుండా ప్రభుత్వం కలుగజేసుకొని కోర్టు ద్వారా దోషులను కఠినంగా శిక్షించాలని తెలిపారు.



సబ్సిడీపై మేలురకం గడ్డి

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా బహు వార్షిక గడ్డిని పెంచుకునేందుకు పశు పెంపకం దారులకు ప్రభుత్వం సబ్సిడీని మంజూరు చేసిందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గురుజయంతి తెలి పారు. మండలంలో 38 ఎకరాలలో గడ్డిని పెంచుకునేందుకు అనుమతి లభించిందని ఆసక్తి ఉన్న అర్హులైన పశు పెంపకం దారులు వారి పొలంలో10నుండి 50 సెంట్ల భూమిలో బహు వార్షిక గడ్డి గను పులను తీసుకొచ్చి నాటిన ఎడల 45 రోజులలో పశువులకు మేతగా వేసుకోవచ్చన్నారు. పశువులు ఈ గడ్డి తినడం వల్ల పాల దిగుబడి అధికంగాపెరుగుతుందన్నారు. పశువుల పెంపకం దారులు ఉపాధి హామీ జాబ్ కార్డు, పొలం పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ పుస్తకాలను దరఖాస్తు ఫారానికి జత చేసి పశు సంవర్ధక కేంద్రంలో ఇచ్చిన వాటిని ఉపాధి హామీ ఏపీఓకు అందజేస్తామన్నారు. వాటిని ఎంపీడీఓ ఏపీఓ పరిశీలించి కలెక్టర్ కు పంపగా అనుమతులు మంజూరు చేస్తారన్నారు. అప్పుడు పనులు మొదలు పెట్టాలని పేర్కొన్నారు. గడ్డి నాటే 50 సెంట్లు పొలాన్ని ఖాళీగా చూపిస్తే ఫీల్డ్ అసిస్టెంట్ కొలతలు ఇస్తారన్నారు. బహు వార్షిక గడ్డి గనుపు నాటిన నుండినీళ్ళ కట్టడం, యూరియా చల్లడం, కలుపు ప్రతి పనికి ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కూలీలకు చెల్లిస్తారు. రెండేళ్ల వరకు పెట్టిన ప్రభుత్వ 32వేల 982 రూపాయలను అందజేస్తుందన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ గురుజయంతి

2న మెగా టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వింజమూరు : నియోజకవర్గ స్థాయిలో ఆపాస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి పి వెంకయ్య తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని కలిగించడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలు వింజమూర్ లోని వై ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షల్లో మొదట బహుమతి పదివేల రూపాయలు రెండవ బహుమతి ఎనిమిది వేల రూపాయలు, వంతున మొదట పదిమందికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వీటితో పాటే ప్రోత్సాహ బహుమతులు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వివి చలమయ్య, మండల ప్రధాన కార్యదర్శి పి వెంగళరావు, ఉపాధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కె.మధు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగులకు ఆటలపోటీలు

ప్రజాశక్తి-కావలి: కావలిలో అంతర్జాతీయ వికలాంగుల ఆటల పోటీలు గురువారం ఘనంగా జరిగాయి. ఆటల పోటీలలో మోటర్ సైకిల్ రేస్, ట్రై సైకిల్ రేస్, స్లో వాకింగ్, ఫాస్టర్ రన్నింగ్, సూదిలో దారం, మ్యూజికల్ చైర్స్, పేర్ల సుధారాణి, ఒకటి, ఒకటి మూగ పోలయ్య, కొండూరు మునెమ్మ తల్లి,బోయిన శ్రీనివాసులు,కుమారి పోలమ్మ, చిన్న వెంకటేశ్వర్లు,రామలక్ష్మమ్మ మొదలగు వారు మొదటి ప్రైజ్ లు తెచ్చుకున్నారు.అదేవిధంగా పాల్గొన్న వికలాంగుల నాయకులు కోడూరు సోమయ్య, మహబూబ్ బాషా, తల్లి బోయిన సీనయ్య, ప్రళయకావేరి వీర్రాజులు వ్యవహరించారు.ముఖ్యఅతిథిగా కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.మండవ వెంకట్రావు మాట్లాడుతూ వికలాంగులు వ్యాయామం చేయుట,ఒక ముఖ్య ఉద్దేశంగా సమాజంలో ఎవరికి తీసిపోని విధంగా ఆటలాడగలుగుతామనే నిరూపించామన్నారు. ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా ఆదివారం 15వ తేదీ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ చేస్తారన్నారు.వక్తల బోధనలు జరుగును. కనుక వివిధ సేవా సంస్థలు వివిధ రాజకీయ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని మండవ వెంకట్రావు కోరారు.


ఆటలు ఆడుతున్న వికలాంగులు

వసతి గృహంలో తనిఖీ

ప్రజాశక్తి-సంగం:ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి..వసతులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు హాస్టల్‌లో వర్షపు నీరు, మురుగు నీరు ఉండటాన్ని పరిశీలించి..నీటిని తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి నరసయ్యకు తెలియజేశారు.ప్రస్తుత వర్షాల దష్ట్యా హాస్టల్ లో వర్షపు నీరు చేరితే విద్యార్థులను స్థానిక బీసీ బాలికల వసతి గృహానికి తరలించాలని వార్డెన్ కి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 65 వసతి గహాలు ప్రభుత్వ బిల్డింగ్ లో ,6 ప్రైవేట్ బిల్డింగ్ లలో ఉన్నాయని తెలిపారు.వసతి గృహాల మరమ్మతులకు ప్రపోజల్స్ పంపి ఉన్నామని తెలిపారు.విద్యార్థులకు అన్నీ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.రాబోయే పరీక్షల్లో వసతి గృహాలలో ఉన్న పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్

గురవారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-దుత్తలూరు :తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ ఉండేల గురవారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నందిపాడు యూజిఆర్ యూత్ ఆధ్వర్యంలో ఉదయగిరిలోని చిల్డ్రన్స్ హోంలో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం చిన్నారులతో కలిసి యూజీఆర్ యూత్ సభ్యులు భారీ కేకును కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టి భోజనం ఏర్పాటు చేసి ఆనందాన్ని వ్యక్తం చేస్తూ గురవారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూజీఆర్ యూత్ సభ్యులు దొంతిరెడ్డి సుబ్బారెడ్డి, నల్లబోతుల శేఖర్ మాట్లాడుతూ ఆశ్రమంలోని 60 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. అదే ఆశ్రమంలో ఉంటూ ఇంజినీరింగ్ చదువుకుంటున్న నందిని అనే అమ్మాయికి కాలేజీ ఫీజు కోసం 21,500 రూపాయలను అందజేసి ఆశ్రమంలో ఉండే చిన్నారులకు 10 రైస్ బ్యాగులను యుజి ఆర్ సభ్యులు తమ దాతత్వాన్ని చాటుకున్నారు. మా నాయకుడు ఉండేల గురవారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టిన యూజి ఆర్ ట్రస్ట్ సభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



రైల్వే గేట్ల స్థానంలో ఆర్ఒబి,ఆర్‌యుబిలు ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గం లోని దగదర్తి మండలం నుంచి కావలి రూరల్ మండలం వరకు విస్తరించి ఉన్న రైల్వే లైన్ పై రైల్వే గేట్ల స్థానంలో రైలు ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబి), రైల్ అండర్ బ్రిడ్జి (ఆర్ యుబి) లను ఏర్పాటు చేస్తామని కావలి శాసనసభ్యులు దగు మాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు.కావలి పట్టణంలోని చౌదరి పాలెం రైల్వే గేట్, పమిడి స్కూల్ సమీపంలోని రైల్వేగేట్, కచ్చేరిమిట్ట ఫైర్,స్టేషన్, రోడ్డుమీదుగా నూతనంగా ఏర్పాటు చేయబోయే రైల్ ఓవర్ బ్రిడ్జి, పెద్దపవని రోడ్డులోని రైల్వే గేట్, బోగోలు మండలంలోని బోగోలు రైల్వే గేట్, కుమ్మరగుంట రైల్వే గేట్లను దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కేడిఎస్ కృష్ణ, రైల్వే సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక ప్రజలు వారిన వమన్యలను రైల్వే అధికారుల దృష్టికితీసుకెళ్లారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న కావలి పట్టణంలోని పెద్దపవని రోడ్డులో రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.కచ్చేరిమిట్ట ఫైర్ స్టేషన్ రోడ్డులో రైల్ ఓవర్ బ్రిడ్జి నెలకొల్ప డానికి, చౌదరిపాలెం వద్ద అండర్ పాస్, పమిడి స్కూల్ వద్ద అండర్ పాస్, కుమ్మరగుంట వద్ద అండర్ పాస్, బోగోలు వద్ద ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయడానికి,అధికారులు పరిశీలనకు రావడం జరిగిందని తెలిపారు. ప్రమాదాలను, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తూ పట్టణంలోని ప్రతి ప్రాంతాన్ని అనుసంధానం చేయడానికి రైల్వే గేట్ల వద్ద ఆర్ఓబి, ఆర్ యూబి లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, కావలి తహశీల్దార్ పి.శ్రావణ్ కుమార్, బోగోలు తహశీల్దార్ మలిశెట్టి సురేష్, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబునాయుడు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, తిరివీధి ప్రసాద్, అధికారులు, టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్యకృష్ణారెడ్డి

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తాం

ప్రజాశక్తి-కావలి:రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకా రంతో కావలి నియోజకవర్గంలోని యువతీ యువకులైన ప్రతిఒక్కరికీ ఉపాధికల్పించడమే తనధ్యేయ మని కావలిశాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి కావలి పట్టణం జెండా చెట్టు వద్ద శ్రీశ్రీశ్రీ నాగూర్ మీరాస్వాముల గంధ మహోత్సవ కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు. దర్గా వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యేకు దర్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. భారీ ఊరేగింపుగా దర్గా వద్దకు జెండాలను తీసుకొచ్చారు. దర్గాలోప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గంధ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొ నడం చాలా సంతోషంగా ఉందన్నారు. చదువుకునే రోజుల నుండి ప్రతిసంవత్సరం గంధమహోత్సవం రోజున దర్గావద్దకు రావడం జరుగుతుందని తెలిపారు.తానుఎమ్మెల్యేగా గెలిచానంటే దాంట్లో ముస్లిం సోదరుల పాత్ర ఎంతోఉందన్నారు. నిజాయతీకి ప్రతీక ముస్లిం సోదర సోదరీమణులని, వారు తనఆత్మ బంధువులన్నారు.ముస్లింలకు ఏకష్టంవచ్చినా ముందుంటానని తెలిపారు. కావలి నియోజకవర్గంలో భారీగా పరిశ్రమలు రానున్నాయన్నారు. యువతకు ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. అందరి సహకారంతో కావలిని కనకపట్టణం చేస్తానన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, జనసేన కావలి ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, దర్గా కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



అండర్ పాస్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట: రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలను వేగవంతంగా నిర్మించాలని కావలి శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బోగోలు పై ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ నిర్మాణం కోసం సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కే డి ఎస్ కృష్ణతో కలిసి గురువారం కావ్య కృష్ణారెడ్డి స్థలాలను పరిశీలించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోగోలు ప్రధాన రైల్వే గేట్ పై ఫ్లై ఓవర్లు బ్రిడ్జి ,కుమ్మరి వీధి రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణం పనులను త్వరగా రైల్వే అధికారులతో మాట్లాడామని తెలిపారు.దక్షిణ మధ్య రైల్వేకు చెందిన సీనియర్ డివిజనల్ ఇంజినీర్‌కు బిట్రగుంట ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై తెలియజేశామని అన్నారు. సందర్భంగా రైల్వే ఇంజనీర్ సానుకూలంగా స్పందించి త్వరలో డిపిఆర్ తయారుచేసి అనుమతులకు పంపిస్తామని తెలిపారు. కొద్దిరోజుల క్రితమే రైల్వే రైల్వే డివిజనల్ మేనేజర్‌ను కలిసి బిట్రగుంట కావలి ప్రాంత సమస్యలు తెలియజేశామన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో బిట్రగుంట అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లగుంట మధుబాబు నాయుడు, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి లక్కాకుల మాధవరావు, సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, టిడిపి నాయకులు సంజయ్, రైల్వే అధికారులు, టిడిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

ఎస్‌సి, ఎస్‌టిలకు నూరుశాతం పనులు

ప్రజాశక్తి-కావలి:జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎస్‌సి, ఎస్‌టిలకు 100 శాతం పనులు కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటిగా మండలాల వారీగా జరుగుతున్న ఉద్యమం పనులపై సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సిబ్బంది అవినీతికి పాల్పడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్థానిక విలేకరులతో అమే మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలు 2025 మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాలు వేస్తున్న సిమెంట్ రోడ్లు సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని ఇప్పటివరకు జిల్లాలో 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. మరో 30 శాతం మార్చి నెలఖరికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 1100 సిమెంట్ రోడ్లు 1300 పశుపాకులను నిర్మాణం జరుగుతున్నాయని 90 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. తుపాను కారణంగా కొన్నిచోట్ల పనులు నత్తనాడకన సాగాయన్నారు ఈ నెలాఖరులోపు 100 శాతం పనులు పూర్తి చేస్తామన్నారు జిల్లాలో 2 వేల 200 ఎకరాల్లో వందల ఎకరాల పొలాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. 1800 ఎకరాలు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తిచేశామన్నారు. ఐదు సంవత్సరాల అంతరం ఆ రైతులు పొలాలపై ఆధారపడి జీవించవచ్చు అన్నారు. రైతులకు అవగాహన కల్పించి వాళ్లకు నచ్చిన మొక్కలు వారి పొలాల్లో నాటుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి గాయత్రీ దేవి, ఎంపీడీఓ అప్పాజీ, 8 మండలాల ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పాపంపల్లెలో రెవెన్యూ సదస్సు.

ప్రజాశక్తి-దుత్తలూరు :కలెక్టర్,ఆర్‌డిఓ ఆదేశానుసారం గత ఆరవ తేదీ నుంచి మండలంలోని పలు గ్రామాలలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వై నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పాపం పల్లి గ్రామంలో ఈ సదస్సులు నిర్వహించి గ్రామస్తుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నవారు ఈ భూ రీ సర్వే ద్వారా భూముల లోటుపాట్లు సరిచేసుకోవడానికి ప్రభుత్వం ఇదొక మంచి అవకాశం గా ప్రజలకు అందించిందని తెలిపారు. మండలంలోని 17 పంచాయతీలలో జరుగనున్నటువంటి ఈ గ్రామసభల్లో గ్రామస్తులు పాల్గొని సమస్యలను పరిష్కరించు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదెమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షులు కనసాని సుబ్బారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ వై నాగరాజు

విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వింజమూరు

నియోజకవర్గ స్థాయిలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మాధవరపు నాగేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో కోకా వారి పల్లి. వికెపాడు. పదవ తరగతి విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్ట్ ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వింజ మూరులో నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్ఎంఎస్. టీచర్లు, విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని చిన్న అబ్బిపురం గ్రామంలో ఆగిన నిత్యావసర సరుకుల పంపిణీ అనే వార్తకు తహశీల్దార్ స్పందించారు. 7 నెలలుగా పంపిణీకి కరువైన ఎండియు వాహనాన్ని పంపించారు. దీంతో ఆ గ్రామ ప్రజలు పత్రికాముఖంగా హర్షం వ్యక్తం చేశారు.


జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

మేస్త్రీకి జ్ఞాపిక అందజేత

ప్రజాశక్తి-కావలి

స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురు వారం ఇటీవల జరిగిన "మెగా పేరెంట్ టీచర్స్ డే"ఘనంగా జరగడానికి సహకరించి వార్డు శానిటరీ మేస్త్రీగా పనిచేసిన షేక్ సలేహ్ చురుగ్గా దగ్గర ఉండి పని చేయడం చేయించారు. వార్డు ఇన్‌ఛార్జీ శానం హరి సూచనలతో అప్పటికప్పుడు ఆలోచన చేసి చుక్క నీరులేకుండా చేసి సభ, సమావేశం చక్కగా, విజయవంతం కావడానికి సహకారం అందించినందుకు పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వి.కల్లయ్య ద్వారా జ్ఞాపికను బహూకరించారు.


బ్రిడ్జిని పరిశీలిస్తున్న దృశ్యం

నక్కల వాగు బ్రిడ్జి పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని హసనాపురం రోడ్డు పోయే దారిలో గల నక్కల వాగు బ్రిడ్జి, పేట సమీపంలోని మరో బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాలకు ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించా మని ఆర్ అండ్ బి అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పేట సమీపంలోని బ్రిడ్జిలను రెండింటినీ పరిశీలించామన్నారు. బ్రిడ్జి పైన నిలిచి ఉన్న నీటిని జెసిబి ని ఏర్పాటు చేసి తొలగిస్తామన్నారు. ఈ పరిశీలనలో సిపిఎం మండల కార్యదర్శి నిస్సార్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధిపై వేమిరెడ్డి చొరవ ప్రశంసనీయం

ప్రజాశక్తి-బిట్రగుంట

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న వందలాది ఎకరాల రైల్వే ఆస్తులను సద్వినియోగం చేసుకొని ఏదైనా రైల్వే అర్మాగార యూనిట్ ఏర్పాటు చేయాలని, రైల్వే శాఖ మంత్రిని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలిసి మాట్లాడడం ఎంతైనా అభినందనీయమని బిట్రగుంట రైల్వే ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ అధ్యక్షుడు, బోగోలు మండల సి,ఐ,టి,యు కార్యదర్శి చల్లా నరహరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిట్రగుంటలో ఉన్న రైల్వే భూములపై జిల్లాలో ఉన్న రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర మంత్రులు, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారా ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి ఒత్తిడి తీసుకొచ్చి బిట్రగుంట అభివృద్ధికి సహకరించాలని కోరారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మనం నివసించే ఇంటితోపాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ అన్నారు. గురువారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో పారిశుధ్య కార్మికులతో కాలువల్లో పూడిక తీత పనులను ముమ్మరంగా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నిల్వ నీటితో అనేక సమస్యలు వస్తాయని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా దృష్టి సారించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ అన్నారు. వార్డు పరిధిలో రోడ్లపై, కాలువల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతేకాక ప్రజలు సైతం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు తమ సహకారం అందించాలని, అప్పుడే సీజనల్ వ్యాధులను దూరం పెట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-ఉదయగిరి:గ్రామాలలోని ప్రజా భూ సమస్యల పరిష్కారం కోసమే ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎం సుభద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని జి చేరువుపల్లిలో నిర్వహిస్తున్న రెవెన్యు సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సును పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామంలో సంబంధించిన భూములలో మార్పులు చేర్పులు, సరిహద్దులు సమస్యలు రీ సర్వేలో పొరపాట్లు అర్జీ రూపంలో తెలిపి సమస్యలను పరిష్కరించుకోవాలని గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ ప్రజల నుంచి పలు రకాల సమస్యల అర్జులను సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, ఆర్ఐ సురేంద్ర, కార్యదర్శి, విఆర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్థిర సాయం అందజేస్తున్న దృశ్యం

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విడవలూరు

మండల కేంద్రం పటేల్ నగర్ గ్రామానికి చెందిన బుధూరు రమణయ్య(70) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు ఈ కుటుంబానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దహన సంస్కారం కోసం 10వేలు రూపాయలు సహాయం అందించారు. మండల టిడిపి ఇన్‌ఛార్జి అడపాల శ్రీధర్ రెడ్డి ఆదేశంతో ఐటిడిపి సత్య వోలు సత్యం రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, చెముకుల శ్రీనివాసులు ద్వారా సహాయం అందించారు. మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు. దీంతో మృతుడు కుటుంబం సభ్యులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ మహిళ చలంచర్ల కామేశ్వరమ్మ, మురళి, విఒఎ సుమలత తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలని జిల్లా పరిషత్ కార్యాలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి విద్యారమ అన్నారు. సుస్థిరాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మొదటి బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించుటలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తగిన పాత్ర పోషించాలని తెలియజేశారు.గ్రామపంచాయతీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రాముఖ్యతను వారికి వివరించారు. సుస్థిరాభివృద్ధి జరగటం వల్ల గ్రామస్థాయిలో అభివృద్ధి జరిగి ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, అన్ని పంచాయతీల సర్పంచులు, సచివాలయ సిబ్బంది కార్యదర్శులు పాల్గొన్నారు.

షాన్‌వాజ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితిమైన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని చావిడి సెంటర్ కు చెందిన షాన్ వాజ్ ను గురువారం సాంబశివా ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా షాన్ వాజ్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తమ ట్రస్టు తరపున ప్రతి నెల రూ.10వేల ఆర్థిక సహాయం మూడు నెలల పాటు షాన్ వాజ్ కుటుంబానికి అందిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, అందరం తోడుగా నిలుస్తామని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట ట్రస్టు సభ్యులున్నారు.

శంఖవరంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-వింజమూరు

మండల పరిధిలోని శంఖవరం సచివాలయంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎండి హమీద్ పాల్గొని మాట్లాడారు. రైతులే ప్రజలు భూ సమస్యల కోసమే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరి భూ సమస్యలు ఉన్నట్లయితే వారు అర్జీ రూపంలో అందజేయాల న్నారు. అనంతరం వాటికి పరిష్కారాన్ని అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో తహశీల్దార్, ఆర్ఐలు, సచివాలయం సిబ్బంది, విఆర్ఒలు, టిడిపి నాయకులు చల్ల వెంకటేశ్వర్లు, కోడూరు నాగిరెడ్డి, డి శ్రీను కే శీను పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని 16గ్రామాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నట్లు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ కె అనీల్ కుమార్ యాదవ్ తెలియజేశారు.నీటి వినియోగదారులు ఎన్నికల ప్రాంగణాలకు వచ్చి 96మంది ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలని కోరారు.ఓటింగ్‌లో పాల్గొనేవారు వారి పట్టాదార్ పాసుపుస్తకం జెరాక్స్ లేదా వన్ బి, ఆధార్ కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకు రావాలన్నారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడికి పోటీదారులుగా ఉండేవారు ఏదైనా గుర్తింపు కార్డు లేదా నీటి పన్ను ఫసలి 1432 వరకు బకాయిలు లేకుండా చెల్లించి తహశీల్దార్ వద్ద రసీదు తీసుకోవాలన్నారు. నీటి పన్ను చెల్లించని రైతులు నీటి వినియోగదారుల సంఘం పోటీకి అనర్హులని తెలియజేశారు.